# అతిథులా? మొత్తుళ్ళులా?

**మీర్ మహిందీ అలి**

''ఏమండీ.. లేవండి'' నిద్రపోతున్న భర్త కాలిపై అరచేతితో బలంగా కొట్టింది స్వరాజ్యం.

సైరన్ లాంటి కేకతోపాటూ, దూలం విరిగి కాలిపై పడ్డట్టూ అనిపించడంతో, మాణిక్యం ఉలిక్కిపడి లేచి బాధతో కాలిని నిమురుకోసాగాడు. ప్రక్కనే భార్య కనిపించేసరికి బాధ మరిచాడు.

''ఏమిటే అలా కేక పెట్టావ్'' కంగారుగా అడిగాడు.

''మామూలుగా పిలిస్తే కేకలా వినిపిస్తుందా'' ప్రక్కనే కూర్చుంటూ అంది.

''నీ మామూలు పిలుపు ఇలా వుంటే కేక ఎలా వుంటుందో'' గత్యంతరం లేక నవ్వుతూ అన్నాడు.

''వేళాకోళమాపి ఇది చూడండి'' అంటూ ఆరోజు దిన పత్రిక అతని చేతిలో పెట్టింది.

''ఏముందే ఇందులో'' అని పేపర్ చూశాడు. చివరి పేజీలో ఓ ఫోటో కనిపించింది.

''అరే మొన్నటి పెళ్ళి ఫోటోనే'' ఆనందంగా అన్నాడు.

''సంతోషపడమని కాదిచ్చింది... మీరు కూడా ఓ నిర్ణయానికి రండి''

నిర్ణయమనే పదం రాబోయే తుఫాన్‌కు సంకేతంలా వినిపించి ఈసారి భయంగా మళ్ళీ ఫోటోను చూశాడు.

రెండు రోజుల క్రితం అతని సోదరుడి సుపుత్రుని పెళ్ళి జరిగింది. రాష్ట్ర మంత్రిగారొకరు పెళ్ళికి వచ్చి వధూవరులను ఆశీర్వదించారు. ఆ దృశ్యమున్న ఫోటో పేపర్‌లో వేయించారు. అందులో అతనికి ఏ ప్రత్యేకతా కనిపించలేదు. ఆ ఫోటో చూసి నిర్ణయించుకోవడానికి ఏముందో అతనికి అర్థం కాలేదు.


''నిర్ణయించుకోవడానికి ఏముందే'' మనసులోని మాటను పైకి చెప్పాడు దీనంగా.

''తప్పు నాదండి. అసలు నిర్ణయించాల్సింది నేను. అనవసరంగా మీరు నిర్ణయించుకోండి అన్నాను.''

''ఏదోలేవే నువ్వూ మరీనూ... అసలు విషయం చెప్పు'' రాబోయే పరిస్థితులకు సిద్ధపడుతూ అన్నాడు.

స్వరాజ్యం అతనికి దగ్గరగా జరిగింది.

''వద్దులేవే అమ్మాయి నిద్రలేచి వుంటుంది'' అటూయిటూ చూస్తూ



మొహమాటంగా అన్నాడు.

"మీ మొఖానికి ఇదొక్కటే తక్కువ" కోపంగా అంది.

"నాదేం తప్పు! నువ్వే దగ్గరికి వచ్చావ్" రుసరుసలాడుతూ అన్నాడు.

"అసలు విషయం వినండెహే..." చిరాగ్గా అరిచింది.

"ఆ! చెప్పు"

"వచ్చేనెల మనమ్మాయి పెళ్ళి వుంది. మనం కూడా ఓ మంత్రిగారిని పెళ్ళికి పిలవాలి. ఆ ఫోటో కూడా పేపర్‌లో రావాలి" అంది ఏం చేస్తావో నీదే భారం అన్నట్టు.

మాణిక్యం అదిరిపడ్డాడు. నీకేమైనా పిచ్చా అందామనుకుని ధైర్యం చాలక దిక్కులు చూడసాగాడు.

"ఏమ్ అర్థం అయిందా?" గట్టిగా అడిగింది.

"అది కాదే! అన్నయ్యగారేమో సెక్రటేరియట్‌లో పని చేస్తారు. ఆయనకు మంత్రులతో లావాదేవీలుంటాయి. అందువల్ల మంత్రిగారు పెళ్ళికి వచ్చి వుంటారు. మనకంత సీన్ లేదు" నిస్సహాయంగా అన్నాడు.

"ఇవన్నీ నాకు చెప్పవద్దు. నా కూతురి పెళ్ళికి మంత్రిగారు రావలసిందే" క్రికెట్‌లో థర్డ్ ఎంపయిర్ డెసిషన్‌లా చెప్పేసి కోపంగా ఆ గదిలోంచి వెళ్ళిపోయింది.

మాణిక్యం తల పట్టుకుని కూర్చున్నాడు.

అతనికి రాజకీయాలంటే ఆసక్తి లేదు. మంత్రులెవరో సరిగ్గా తెలియదు. కౌన్సిలర్ కాదుగదా కనీసం బస్తీ లీడర్‌తో కూడా పరిచయం లేదు.

ఆరోజు ఆఫీసులో మంత్రిగారి విషయమై చాలామందిని అడిగాడు. అందరూ ఏవేవో చెప్పారు. ఎవరి సలహా నచ్చలేదు. చివరికి అటెండర్ చెప్పిన సలహా నచ్చి ఆచరిద్దామనుకున్నాడు.

సాయంత్రం ఆఫీసర్ పర్మిషన్ తీసుకుని ఇంటికి తొందరగా బయల్దేరాడు. ఇంటి పరిసరాల్లో వచ్చి బస్తీ లీడర్ గురించి వాకబు చేశాడు. ఇరాని కేఫ్‌లో వున్నాడని తెలుసుకొని అక్కడికి వెళ్ళాడు. అక్కడ కూడా ఎవరితోనో కనుక్కుని లీడర్ కూర్చున్న టేబుల్ దగ్గరికి నడిచాడు.

"నమస్కారమండి అలిభాయ్" లీడర్‌కు ఎదురుగా కూర్చుంటూ వినయంగా అన్నాడు.

"ఆ నమస్తే! ఎవర్ మీరు" అతన్ని ఎగాదిగా చూస్తూ లీడర్ అన్నాడు.

"నేనిదే బస్తీలో వుంటానండి"

"గట్లనా! ఇగో ముందే జెప్తున్న నల్లా ఈరోజు కూడ రాదు. నీళ్ళ బండికి జెప్పించినా గదొస్తది. నీళ్ళు పట్టుకోండ్రి"

"అది కాదండి" మాణిక్యం ఏదో చెప్పబోయాడు.

"రేసన్ కారట్లు కొత్తవి ఇస్తలేరు" ఇక నువ్వెళ్ళచ్చు అన్నట్టు చూశాడు.

"అబ్బే అది కూడ కాదండి... మీతో కొంచెం పర్సనల్‌గా పని వుంది"

పర్సనల్ పని అనగానే లీడర్ మొహం ప్రసన్నంగా మారింది. వెంటనే ప్లేట్ సమోసాకు ఆర్డరిచ్చాడు.

"ఆర్డరిచ్చినా. పైసలైతే ఉన్నాయి కదా!" నిస్సంకోచంగా అడిగాడా లీడర్.

"ఉన్నాయండి" లోపల మండుతున్నా వినయంగా అన్నాడు.

"ఆ పనేందో గిప్పుడు చెప్పు"

"మంత్రిగారితో పనుంది"

వెయిటర్ సమోసాలు తెచ్చి పెట్టాడు. లీడర్ తినడం ప్రారంభించాడు.

మాణిక్యానికేమో టెన్షన్ పెరగసాగింది.

"అలిభాయ్ నే చెప్పింది"

"ఆ ఏమిటన్నావ్?" తాపీగా అన్నాడు.

"అదేనండి మంత్రిగారితో పని..." కాస్త అసహనంగా అన్నాడు.

"మంతిరి అంటే ఏ మంతిరి" సమోసా కొరుకుతూ అన్నాడు.

ఆడియో షాప్‌లో ఏ సినిమా క్యాసెట్ కావాలి అని షాపతను క్యాజువల్‌గా అడిగినట్టు అనిపించింది మాణిక్యానికి.

"ఏ మంత్రి అయినా ఫర్వాలేదు. నా కూతురి పెళ్లికొస్తే చాలు..."

భళ్ళున నవ్వాడా లీడర్. ఆ నవ్వుకు అతని నోటిలోని లాలాజలం తుంపరల రూపంలో వచ్చి సమోసాల్ని తడిపేసింది.

లీడర్ ఎందుకు నవ్వుతున్నాడో మాణిక్యానికి అర్థం కాలేదు. నవ్వు ఆపేవరకు ఏమ్మాట్లాడలేదు కనుక కనీసం ఆ తుంపరలు తన మొఖంపై పడకూడదన్నట్లు కర్చీఫ్ తీసి అడ్డంగా పెట్టుకున్నాడు.

అది చూసి లీడర్ నవ్వు ఆపాడు. "ఏం భాయ్ గిట్ల దస్తీ పట్కున్నావ్" సందేహంగా అడిగాడు.

"ఏం లేదు. సమోసాలు కొంచెం వాసన వస్తున్నట్టు కనిపించి..." గొణిగాడు, అసలు విషయం చెబితే లీడర్ తన పని చేయడనే భయంతో.

"నువ్వసల్ ఒక్కటిగూడ తినందే వాసనొస్తుందని ఎట్ల జెపుతున్నవ్. ఇగో ఒకటి తిని సూడు" చిరుకోపంగా అన్నాడా లీడర్.

"అబ్బే నాకు గ్యాస్ ట్రబులుంది. నేనేమీ తినలేను" కంగారుగా అన్నాడు లాలాజల తుంపర్లున్న సమోసా తినిపిస్తాడనే భయంతో.

"సరే అన్ని నేనే తింటాలే... మంత్రి నీ బిడ్డ పెండ్లికి రావాలి బస్ గంతే కదా" తేలిగ్గా అన్నాడు.

"అంతేనండి"

"పెళ్ళి ఏ ఫంక్షన్ హాల్లో జేస్తున్నవ్"

"మా ఇల్లు చాలా పెద్దది. అక్కడే చేస్తున్నానండి"

"కుదర్దు. ఫంక్షన్‌హాల్ కయితేనే మంతిరి వస్తడు"

"కానీ?" నచ్చచెప్పే ప్రయత్నంగా అన్నాడు.

"ఇగోభాయ్ నీ యిష్టం. మంతిరికి సెకూరిటీ పాబ్లం శాన ఉంది. గిట్లా ఎవరిండ్లకు రాడు"

"సరే! ఫంక్షన్ హాలే తీసుకుందాం" అనివార్యంగా అన్నాడు.

"గదీ పద్దతి... అసలు ఇషయం ఖుల్లా ఖుల్లా జెప్తున్నా.. నీకు పాంచ్ హజార్ ఖర్సొస్తది" సిగరెట్ ముట్టిస్తూ అన్నాడు.

"అయిదు వేలా?" మాణిక్యం విస్మయంగా నోరు తెరిచాడు.

"గిట్లంటే నాక్కోపం వస్తది. మంతిరీ రావాలి. ఖర్చు కావొద్దంటే ఎలా?"

"అసలీ ఖర్చు ఎందుకో" నీళ్ళు నములుతూ అన్నాడు.

"గట్లా అడుగు జెప్తా... నీ గురించి మంతిరికి ఎట్లయినా నేను జెప్పుకుంటా! నీ పెండ్లి కారడ్ పియ్యేకు చూపి డయిరీలో రాయించాలి. గాయనే అంటడు. మంతిరికా దినం ప్రోగ్రామ్స్ శాన ఉన్నయని. ఇగ గాయనకు ఎన్నో కొన్ని జేబులో పెట్టాలి. మంతిరీ కారు డిరేవర్ తొవ్వ తెలవదంటడు. గాయనకియ్యాలే. అటెండర్‌కు కొన్ని ఇయ్యాలే.... అన్ని జెప్తే నువ్వు పరేశాన్ అవుతవ్"

"ఓ రెండు వేలల్లో డిసైడ్ చేయ్ అలీభాయ్" అభ్యర్థిస్తూ అన్నాడు.

"గట్లా అడుగు జెప్తా... నీ గురించి మంతిరికి ఎట్లయినా నేను జెప్పుకుంటా! నీ పెండ్లి కారడ్ పియ్యేకు చూపి డయిరీలో రాయించాలి. గాయనే అంటడు. మంతిరికా దినం ప్రోగ్రామ్స్ శాన ఉన్నయని. ఇగ గాయనకు ఎన్నో కొన్ని జేబులో పెట్టాలి. మంతిరీ కారు డిరేవర్ తొవ్వ తెలవదంటడు. గాయనకియ్యాలే. అటెండర్‌కు కొన్ని ఇయ్యాలే.... అన్ని జెప్తే నువ్వు పరేశాన్ అవుతవ్"

"దో హజార్లోనా?... సరే గీ ఏరియా కౌన్సిలర్‌ను పిలుదాం. బిల్లు కట్టి దయచేయ్" కోపంగా అన్నాడా లీడర్.

మాణిక్యం లేచి వెడదాం అనుకున్నాడు. భార్య గుర్తుకు రాగానే కంగారు కలిగింది.

"మంచిది భాయ్. నువ్వెట్లా చెప్తే అట్టే చేద్దాం" ఆత్రంగా అన్నాడు

"పెండ్లి కారడ్ తీసుకోని నా దగ్గరికి రా! మంతిరి కాడికి పోదాం... అట్లనే ఫైసల్ కూడ తెచ్చుకో"

"సరే" అని మాణిక్యం లేచాడు. హోటల్ బిల్ చెల్లించి బయటికి నడిచాడు.

కొన్ని రోజుల తర్వాత లీడర్‌ను కలిసి శుభలేఖ, ఐదువేలు ఇచ్చాడు.


పెళ్ళిరోజు రానే వచ్చింది.

కూతురి పెళ్ళికి మంత్రిగారు వస్తున్నారనే ఉద్దేశ్యంతో ఏర్పాట్లన్నీ మాణిక్యం స్వయంగా చూస్తున్నాడు. అయితే మంత్రిగారి విషయమై అతని మనస్సులో సంశయంగా వుంది.

క్రితంరోజు మరో మంత్రిపై తీవ్రవాదుల

## కత్రీనాకు కరవైన 'బర్సాత్'

అందివచ్చిన అదృష్టాన్ని చేతులారా నాశనం చేసుకుంటోంది కత్రీనా. సునీల్ దర్శన్ తెలుసుకదా? ఈమధ్యనే హిట్ సినిమా 'అందాజ్' తీశాడు. గతంలో అతను తీసిన రాజా హిందుస్తానీ సినిమా హీరో ఆమీర్‌ఖాన్‌కూ, హీరోయిన్ కరిష్మాకూ ఎంత పేరు తెచ్చిందో అందరికీ తెలుసు. అలాంటి సంస్థ నుంచి ఈ పిల్లకు వాళ్ళ కొత్త సినిమాలో హీరోయిన్ ఆఫర్ వస్తే నానా ఆరాలు తీసి వాళ్లకు విసుగుపుట్టించింది. కత్రీనాకు హిందీ రాదు. వున్నదల్లా తెల్లతోలు మాత్రమే. అయినా ఆపిల్ల అదృష్టం కొద్దీ పెద్ద సంస్థనుంచి ఆఫర్ వచ్చింది. అయినా నిలుపుకోలేకపోయింది.



హత్యాయత్నం జరిగింది. రాష్ట్రమంతా రెడ్‌అలర్ట్‌గా వుంది. ఆ పరిస్థితుల్లో తమ మంత్రి పెళ్ళికి వస్తాడా అనే అనుమానం మాణిక్యం మనస్సును పీకుతోంది. ఎందుకైనా మంచిదని తను డబ్బులిచ్చిన లీడర్‌ను సంప్రదించాడు. లీడర్ అభయం ఇచ్చాడు. కాపోతే ''సెక్యూరిటీ టైట్‌గా వుంటుంది. వాళ్ళతో సహకరించాలి'' అన్నాడు.

'టైట్' సెక్యూరిటీకి సరిగ్గా అర్థం తెలియని మాణిక్యం లీడర్‌కు మాట ఇచ్చాడు.

ఆ క్షణం నుంచే అతనికి ఇబ్బందులు ప్రారంభమయ్యాయి.

పెళ్ళి ముహూర్తానికి కొన్ని గంటల ముందు ఫంక్షన్ హాల్ తనిఖీ నిమిత్తం బాంబు స్క్వాడ్ వచ్చింది. స్నిఫర్ డాగ్, మెటల్ డిటెక్టర్‌లతో ఆ స్క్వాడ్ అణువణువు పరిశీలించసాగింది. ఆ దృశ్యాన్ని స్వరాజ్యం తమ బంధువులకు గర్వంగా చూపించసాగింది.

ఆ స్క్వాడ్ మాణిక్యాన్ని పిలిచి మంత్రిగారి సెక్యూరిటీ దృష్ట్యా కొన్ని అభ్యంతరాలను తెలిపింది. అతను నవ్వలేక, ఏడవలేక వేదికకు సమీపంగా వున్న కుర్చీల పొజిషన్ కష్టపడి మార్పించాడు. మంత్రిగారి కారు దగ్గరి నుండి వేదిక వరకు ప్రత్యేకంగా దారి ఏర్పాటు చేయించి, వేరేవాళ్ళు ఆ దారివైపు వెళ్ళకుండా రోప్స్ కట్టించాడు.

ఆ స్క్వాడ్ చెప్పిన సూచనలు తూచ తప్పకుండా పాటించాడు. అప్పుడే పోలీసు డిపార్ట్‌మెంట్ మరో ఆక్సెస్ కంట్రోల్ టీం వచ్చింది. ఫంక్షన్ హాల్ ద్వారాల వద్ద డోర్‌ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు పెట్టి మాణిక్యాన్ని పిలిచారు.

అప్పటికే బాంబు స్క్వాడ్ సూచనలు ఆచరించి, మానసికంగా, శారీరకంగా అలసిపోయి వున్న అతను ''మళ్ళీ ఏమొచ్చిందిరా భగవంతుడా'' నీరసంగా అనుకుంటూ వాళ్ళతో కలిశాడు.

''ఫంక్షన్ హాల్లోని అందరినీ బయటికి వెళ్ళి రమ్మనండి. ఒక్కొక్కరిని తనిఖీ చేస్తూ లోనికి పంపించాల్సి వుంటుంది'' వాళ్ళు అన్నారు.

మాణిక్యం బిత్తరపోయాడు. ''అది జరిగేపని కాదు'' కాస్త ధైర్యం తెచ్చుకుని బదులిచ్చాడు.

''అలా జరగకుంటే అది సెక్యూరిటీకి విరుద్ధం. సెక్యూరిటీ లేని ప్రదేశాల్లో మంత్రిగారు రాలేరు'' వాళ్ళు నిష్కర్షగా అన్నారు.

అతను భార్యను సంప్రదించాడు. ''మంత్రిగారికోసం ఏమైనా చేద్దాం'' ఆమె స్థిరంగా చెప్పేసింది.

భార్య మాటను జవదాటలేక బంధువుల నిరసనల మధ్య సెక్యూరిటీ వాళ్ళు చెప్పిన పని కానిచ్చాడు. అతని తరపున బంధువుల నిరసనల్ని పెడచెవిన పెట్టాడే కాని అసలు సమస్య మగపెళ్ళివారి నుండి రాసాగింది.

పెళ్ళికొడుకు ఒక్కడిని వదిలి మిగిలిన వారిని, శిరస్సు నుంచి కాళ్ళ వరకు తనిఖీ చేస్తూ సెక్యూరిటీ వాళ్ళు లోనికి పంపిస్తున్నారు. ఆ చర్య కొందరికి ఇబ్బందిగానూ, ఇంకొందరికి బాధగానూ, మరి కొందరికి అవమానంగానూ అనిపించసాగింది. వాళ్ళందరు మాణిక్యం వియ్యంకుడితో మొరపెట్టుకున్నారు. కొందరయితే 'పెళ్ళికి పిలిచి ఇలా అవమానిస్తారా?' మేమేమయినా దొంగలమా, తీవ్రవాదులమా' అంటూ గొడవ చేయసాగారు. వియ్యంకుడు భరించలేక మాణిక్యాన్ని నిలదీశాడు. అతను పోలీసులను అభ్యర్థించాడు.

వాళ్ళు అతనివైపు ముభావంగా చూశారే తప్ప నోరు విప్పలేదు. ఏదైనా ఇన్సిడెంట్ జరిగి పోలీసు శాఖకు తలవంపులు వచ్చినప్పుడు కొన్నిరోజులు పోలీసు వాళ్ళు అందరినీ అదరగొట్టే సెక్యూరిటీ చేస్తారు. ఆ విషయం మాణిక్యానికి తెలియదు. అతని దురదృష్టం వలన ఆ సమయంలో రాష్ట్రమంతా రెడ్ అలర్ట్ వుంది.

ముహూర్తపు టైం కావడానికి ఇంకొన్ని నిమిషాల వ్యవధి వుంది.

ఆహూతులు వస్తున్నారు. నిరసనలు పెరుగుతున్నాయి. స్నేహితులు వచ్చి మొరపెట్టుకోవడంతో పెళ్ళికొడుకు కోపం పెరిగిపోయింది. కాబోయే మామను పిలిచి వార్నింగ్ ఇచ్చాడు. దాంతో ఇంకా నిరసనలు పెరిగిపోయాయి.

''అభిమానానికి వచ్చాము, అవమానానికి కాదు. పోలీసులన్నా ఉండాలి. లేదా మేమైనా ఉండాలి'' అధికశాతం బంధువులు మాణిక్యంతో గొడవ పడసాగారు.

మాణిక్యం పదేపదే పోలీసు వాళ్ళను సంప్రదిస్తూ అభ్యర్థిస్తున్నాడు. కాని సెక్యూరిటీ 'టైట్'గానే నడుస్తుంది.

సహనం నశించిన మాణిక్యం బంధువులతో పడలేక పోలీసులతో గొడవపడ్డాడు.

సెక్యూరిటీ గురించి, ప్రస్తుత పరిస్థితి గురించి చెప్పి పోలీసులు మాణిక్యానికి నచ్చచెప్పాలని చూశారు. అర్థం చేసుకునే ప్రయత్నం చేయని అతను మరింత రెచ్చిపోయాడు.

''అతిథులా? అమాత్యులా? వీళ్ళలో ఎవరు కావాలో నిర్ణయించుకో'' సెక్యూరిటీ వాళ్ళు తెగేసి చెప్పారు.

అప్పటివరకు అనుభవిస్తున్న మానసిక, శారీరక బాధ అతన్ని స్తబ్దంగా మార్చాయి.

మంత్రిగారి గురించి ఖర్చు చేసిన డబ్బుల విషయం గానీ, ఆయన పెళ్ళికి రాకుంటే గయ్యాళిగా మారే భార్య విషయం గాని గుర్తుకు తెచ్చుకోవడానికి యిష్టపడని మాణిక్యం పోలీసు వాళ్లతో స్థిరంగా చెప్పేశాడు.

'అమాత్యులు వద్దు. అతిథులే కావాలి''

''కొన్ని నిమిషాలకోసం వచ్చి వెళ్ళే మంత్రిగారి గురించి ఇబ్బంది పడటంకన్నా, జీవితాంతం కలిసి వుండే బంధువుల గురించి ఆలోచించడం మిన్న''

అప్పటివరకు ఆ సంభాషణ విన్న స్వరాజ్యం కూడా ఇదే విషయాన్ని మనస్ఫూర్తిగా అనుకుంది.